ఎస్సీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు 12న స్పాట్ కౌన్సెలింగ్

నల్లగొండ/ సూర్యాపేట అర్బన్ సెప్టెంబర్ 10 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదు నుంచి తొమ్మిదో తరగతి వరకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 12న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆర్సీఓ విద్యారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు సంబంధించి సూర్యాపేట జిల్లాలోని దురాజ్‌పల్లి రోడ్డులో ఉన్న ఇమాంపేట ఎస్సీ గురుకుల విద్యాలయంలో, యాదాద్రి, జనగాం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు సంబంధించి భువనగిరి సీఓఈ బాలుర కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులు, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆయా పాఠశాలల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుల ఆధారంగా మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఖాళీలు, అర్హతను బట్టి సీట్ల భర్తీ నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు బోనఫైడ్‌తో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు ఇమాంపేట-9704550271, భువనగిరి-99493 56343 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

అంతులేని కథలా.. రుణమాఫీ

మూడో విడుత తర్వాత ఒక్కరికీ అదనంగా రుణమాఫీ కాలె

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిత్యం వ్యవసాయ పాలాల్లో ఉండాల్సిన రైతులు అంతకుమించిన సమయాన్ని బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరగడానికే వెచ్చించాల్సి వస్తున్నది. అందుకు కారణం అంతులేకుండా సాగుతున్న రుణమాఫీ కథనే. ప్రభుత్వం ప్రకటించిన మూడు విడుతల రుణమాఫీలో ఉమ్మడి జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 60శాతానికి మించలేదు. దీంతో మిగతా 40శాతానికి పైగా రైతులు రుణమాఫీ కోసం చెప్పలరిగేలా తిరుగుతున్నారు. అన్ని అర్హతలున్నా రుణమాఫీ కాకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున రైతులు ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అయినా ప్రభుత్వం వైపు నుంచి మూడో విడుత రుణమాఫీ తర్వాత కొత్తగా ఒక్క రైతుకు కూడా రుణమాఫీ అయిన దాఖలాలు లేకపోవడం గమనార్హం.

– నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్10(నమస్తే తెలంగాణ)

బ్యాంకులు, అధికారుల చుట్టూ రైతుల చక్కర్లు

రేషన్‌కార్డు లేని వారి సర్వే ఇంకా ఎన్ని రోజులో..

మిగతా కారణాలతో కాని వారిది తేలేది ఎన్నడో?

రైతుల ప్రశ్నలకు సమాధానం చెప్పే నాథుడే కరువు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు విడుతల్లో కలిపి 3.39లక్షల మంది రైతులకే రుణమాఫీ జరిగింది. జిల్లాలో కనీసం ఆరు లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హులు ఉంటారని రైతు సంఘాల అంచనా. ఇంకో రెండున్నర లక్షల మంది రైతులు రుణమాఫీకి దూరంగా ఉన్నారు. వీరంతా రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రుణమాఫీ కాని వారిలో రేషన్‌కార్డు లేని వాళ్లు, ఒక కుటుంబంలో ఉన్న వ్యక్తులకు రెండు లక్షలకు మించి రుణం ఉన్నవాళ్లు, ఆధార్, బ్యాంకు అకౌంట్, పట్టాదారు పాసుపుస్తకం నంబర్లతో పాటు పేర్లు సరిపోలకపోవడం లాంటి వాళ్లు ఉన్నారు. వీరంతా ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆందోళనలు, నిరసనలకు దిగారు. పలు వేదికల మీదుగా ప్రభుత్వాన్ని నిలదీశారు. దీంతో ప్రభుత్వం రైతుల ఆగ్రహాన్ని చల్లార్చడానికి పలు ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నది. రేషన్‌కార్డు లేని రైతుల సర్వే ఓ వైపు, తప్పులను సరిదిద్దే కార్యక్రమాన్ని మరోవైపు నడిపిస్తున్నట్లుగా ప్రకటించింది. కానీ వీటికి నిర్దిష్టమైన గడువు ఏదీ పెట్టలేదు. దీంతో ఎంత వీలైతే అంత సాగదీయడమే లక్ష్యమన్నట్లుగా ప్రభుత్వ వ్యవహార శైలి కనిపిస్తున్నది. తిరిగి తిరిగి విసిగి చివరకు రైతులే రుణమాఫీపై ఆశలు వదులుకునేలా చేయడమే ప్రభుత్వ వ్యూహమన్నట్లుగా తెలుస్తున్నది.

రేషన్‌కార్డు సర్వే పేరుతో..

నిజానికి రుణమాఫీ కాకపోవడానికి 31 కారణాలు ఉన్నాయని స్వయంగా రాష్ట్ర వ్యవసాయ శాఖనే గుర్తించి ప్రభుత్వానికి పంపింది. ఆ లెక్కన 31 అంశాలపై క్లారిటీ ఇస్తూ ఆ కారణాలతో రుణమాఫీ కాని రైతుల వివరాలను ప్రభుత్వం సేకరించాల్సి ఉంది. ఇదే సమయంలో రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించేందుకు ఇంటింటా సర్వే చేస్తామని ప్రకటించింది. ప్రభుత్వం చెప్పిన దాని ప్రకారం చూస్తే రుణమాఫీ కాని అందరి రైతులకు సంబంధించి సర్వే జరగాలి. కానీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. రేషన్‌కార్డు లేక మాఫీ కాని రైతుల వివరాలను సేకరించే బాధ్యత వ్యవసాయ శాఖ తీసుకుంది. దీని ప్రకారం కూడా వ్యవసాయ అధికారులు రైతు గ్రామాల వారీగా తేదీలు ఇచ్చి కొనసాగిస్తున్నారు. కానీ ఈ సర్వే పూర్తికి ప్రభుత్వం నిర్దిష్టమైన గడువేదీ పెట్టలేదు. దీంతో ఇది నత్తనడకన సాగుతున్నది. నల్లగొండ జిల్లానే పరిశీలిస్తే వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం 44వేల మంది రైతులు ఉన్నారు. కానీ నేటికీ 20వేల మంది రైతుల వివరాలను మాత్రమే సేకరించారు. అంటే ఇంకా సగానికి పైగా రైతుల వివరాలు సేకరించి వారితో సెల్ఫీ ఫోటో దిగి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఇది ఎప్పటివరకు పూర్తవుతుందనేదానికి క్లారిటీ లేదు.

మిగతా వారి పరిస్థితేంటో...?

ప్రస్తుతం కుటుంబ నిర్ధారణ కోసం రేషన్‌కార్డు లేని వారి వివరాల సేకరణ మాత్రమే జరుగుతుంది. మిగిలిన 30 కారణాలతో రుణమాఫీ కాని రైతుల పరిస్థితి ఏంటో తేలడం లేదు. అయితే ఇందులోనూ ఆధార్, బ్యాంకు, పట్టాదారు పాసుపుస్తకం, లోన్ అకౌంట్ నంబర్లలో తప్పులు లేదా పేర్లు సరిపోలకపోవడం వంటి తప్పుల సవరణ బాధ్యతలను బ్యాంకు మేనేజర్లకు అప్పజెప్పారు. వారినే నోడల్ అధికారులుగా ప్రకటిస్తూ వారే వీటిని సరిచేయాలని ఆదేశించారు. అయితే ఇది కూడా నత్తనడకన సాగుతున్నది. బ్యాంకర్లు వాళ్ల రోజు వారీ బ్యాంకు పనులతో రుణమాఫీ అర్జీలపై పెద్దగా దృష్టి సారించడం లేదు. పైగా దీనికి కూడా ఎలాంటి నిర్దిష్ట గడువు లేకపోవడంతో రేపుమాపు చుద్దామంటూ రైతులను తిప్పుతున్నారు. ఇక డీసీసీబీ బ్యాంకుల్లో సైతం 40శాతానికి మించి మాఫీ కాలేదు. ఇక్కడ కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో సదరు రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయక తప్పడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో రుణమాఫీ కాని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రుణమాఫీ కాకపోవడంతో జిల్లా స్థాయిలో కలెక్టర్ నిర్వహించే ప్రజావాణి మొదలు క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారి వరకు దరఖాస్తులు చేస్తూ దండం పెడుతున్నారు.

చిత్తశుద్ధి కరువు

ప్రభుత్వానికి రుణమాఫీ విషయంలో చిత్తశుద్ధి లేకపోవడంతోనే రైతులు ఇబ్బందికి గురవుతున్నారన్నది నిజం. లక్షలాది మందిలో నెలకొన్న ఆందోళనకు చెక్ పెట్టాలని ఉద్దేశం ఉంటే జిల్లాల వారీగా మంత్రులు సమీక్ష చేయవచ్చు. కానీ అలాంటి భరోసా ఏదీ రైతులకు ఇవ్వడంలో ఉమ్మడి జిల్లా మంత్రులు విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నేటికీ రుణమాఫీ కోసం నిత్యం ఎక్కడో ఓ చోట రైతుల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్నికల్లో ప్రకటించిన విధంగా అర్హులైన రైతులందరి మాఫీ కోసం నేటికీ పోరాటం చేస్తూనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లా మంత్రులు ఒకసారి అధికార యంత్రాంగంతో సమావేశం నిర్వహించి సమీక్ష చేస్తే బాగుండేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అసలు రుణమాఫీ ఇంకా ఎంత మందికి కావాల్సింది? ఏ కారణాలతో కాలేదు? ఇందులో మాఫీకి ఎంత మంది అర్హులు? లోపాలు బ్యాంకుల వద్దనా లేక వ్యవసాయ శాఖ వద్ద ఉన్నాయా? ఇలాంటి వాటిపై సమీక్షించి నిర్దిష్ట గడువు విధిస్తే అంతులేని రుణమాఫీ కథకు ముగింపు పలుకవచ్చని సూచనలు వస్తున్నాయి. ఇవన్నీ ఎలా ఉన్నా రుణమాఫీ చేయాలని ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇవన్నీ ఉండేవేమో, కానీ అలాంటి పరిస్థితి క్షేత్రస్థాయిలో కనిపించడం లేదన్నది మాత్రం వాస్తవం.

రేషన్ కార్డు లేదని తిప్పుతున్నారు

బ్యాంకులో 90వేల రుణం బాకీ ఉంది. రేషన్ కార్డు లేదని రుణమాఫీ కాలేదని అంటున్నారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా అప్పు పోతుందని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది. పదిరోజుల నుంచి దరఖాస్తు ఇవ్వడానికి వ్యవసాయాధికారుల చుట్టు తిరుగుతున్నా. ఎవరూ ఎలాంటి సమాధానం ఇవ్వడం లేదు. భార్యాభర్తలం ఇద్దరేం ఉంటాం. నిరుపేద కుటుంబం. మా అప్పు తీరే విధంగా చూడాలి.

- పజ్జూరి పద్మ, త్రిపురారం

మా పేరు లేదంటున్నారు

రేషన్‌కార్డు ఉంది. బ్యాంకులో అప్పు ఉంది. మా పేరు రుణమాఫీలో లేదని అంటున్నారు. బ్యాంకు దగ్గరకు వెళ్తే వ్యవసాయ అధికారి దగ్గరకు పొమ్మంటున్నారు. వ్యవసాయాధికారి దగ్గరికి వెళ్తే బ్యాంకు దగ్గరికి పొమ్మంటున్నారు. ఐదు రోజులుగా తిరుగుతున్నాం. అప్పు తీరే మార్గం చెప్పాలి.

- సింగం సోమమ్మ, త్రిపురారం

నాట్ల పనులు వదిలేసి తిరుగుతున్నాం

నేను 2018 జనవరి 30న అప్పు తీసుకున్నా. ఆ టైంలో తీసుకున్న వారికి రుణమాఫీ కాదని చెప్తున్నారు. 2018లో తీసుకున్న వారికి రుణమాఫీ అవుతుందా లేదా అని వ్యవసాయాధికారి చుట్టు తిరిగితే ఆయన కలువడం లేదు. నాట్లు పెట్టుకునే పనులు వదిలేసి వీళ్ల చుట్టూ తిరగాల్సి వస్తుంది. వీళ్లు కలువడం లేదు. దరఖాస్తు తీసుకోవడం లేదు. ఎవరికి ఇవ్వాలో చెప్తే వారికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. నా అప్పు రూ.60వేలు ఉంది. రుణమాఫీ కింద పోతే బాగుంటుంది.

- పానుగోతు లక్పతి, పలుగుతండా, త్రిపురారం మండలం

రుణం వస్తరో రాదో

2.20లక్షల రుణం తీసుకున్నందుకు రూ.60వేల వడ్డీ కట్టాలని బ్యాంకు వాళ్లు చెప్పారు. వడ్డీ కడితేనే 2లక్షలు అకౌంట్‌లో పడుతాయని చెప్పడంతో అప్పు చేసి మరీ వడ్డీ కట్టిన. ఇప్పుడేమో వ్యవసాయశాఖ వాళ్లని కలువాలని చెప్తున్నారు. వ్యవసాయాధికారులు ఎందుకు కట్టావని అడుగుతున్నారు. రుణమాఫీ కాకపోగా మళ్లీ అప్పు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. అసలు ఈ రుణం వస్తదో రాదో ఎవరిని అడుగాలో తెలియడం లేదు.

- పద్మ చినరామయ్య, అంజనపల్లి, త్రిపురారం మండలం

మర్రిగూడకు దిగువగా ట్రిపుల్ ఆర్ రోడ్డు!

- **రాష్ట్ర ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్చడంతో మరోచోట మార్కింగ్**
- **సమీప గ్రామాల రైతుల్లో ఆందోళన**

మర్రిగూడ తూర్పుతండా శివారులోని కిష్టరాయినిపల్లి రోడ్డుపక్కన కల్వర్టుపై కొత్తగా వేసిన ట్రిపుల్ ఆర్ మార్క్

మర్రిగూడ, సెప్టెంబర్ 10 : మర్రిగూడ మండల ప్రజలకు రీజినల్ రింగ్ రోడ్డు ఫీవర్ పట్టుకుంది. వారం రోజుల కిందట పలు గ్రామాల్లో మరోసారి ప్రభుత్వ యంత్రాంగం కొత్తగా ట్రిపుల్ఆర్ మార్క్‌లు వేయడంతో నలుగురు గుమికూడిన చోట ఇదే చర్చ నడుస్తున్నది. గతంలో మాదిరిగానే ట్రిపుల్ ఆర్ రోడ్డు మార్గం మర్రిగూడ మండల కేంద్రానికి దిగువగా వెళ్లనుంది. మండలంలోని అంతంపేట-నామాపురం, మేటిచందాపురం-కొట్టాల, సరంపేట-లెంకలపల్లి, తానేదార్‌పల్లి-దామెర భీమనపల్లి, వట్టిపల్లి-దామెర భీమనపల్లి, మర్రిగూడ-భట్లపల్లి, మర్రిగూడ-కిష్టరాయినిపల్లి బీటీరోడ్ల గుండా ట్రిపుల్ ఆర్ రోడ్డును నిర్మించనున్నట్లు తెలుస్తుంది.

మారిన అలైన్‌మెంట్...

రాష్ట్ర ప్రభుత్వం చేసిన తాజా సర్వేతో పలు గ్రామాల్లో ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మారింది. సరంపేట, పిల్లిగుండతండా, మర్రిగూడ శివారు, తూర్పుతండా శివారులో కొత్తగా మార్క్ వేయడంతో పాత అలైన్‌మెంట్ దిగువకు జరిగింది. అంతంపేట, కొట్టాల, వట్టిపల్లి గ్రామాల్లో ఎలాంటి మార్క్ వేయకపోవడంతో గతంలో ఉన్న అలైన్‌మెంట్‌నే కొనసాగిస్తారనే సమాచారం.

మర్రిగూడ శివారు నాంపల్లి రోడ్డులో కొత్తగా వేసిన ట్రిపుల్ ఆర్ మార్క్

రైతుల్లో మొదలైన ఆందోళన...

దక్షిణ భాగం రీజినల్ రింగ్ రోడ్డు సర్వే కోసం ప్రభుత్వం పలుమార్లు ఉన్నత స్థాయి సమీక్షలు నిర్వహిస్తుండంటంతో భూ సేకరణలో వేగం పెరుగొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రాజధాని నగరం హైదరాబాద్‌కు మర్రిగూడ మండలం 60 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండటంతో ఇక్కడి భూములకు రూ.50లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు ధర పలుకుతున్నది. విలువైన భూములు ట్రిపుల్ ఆర్ భూసేకరణలో పోతే తమ పరిస్థితి ఏంటని రైతులు, ఇక్కడ భూములను కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంతో వారు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.



26 క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న సాగర్ డ్యామ్ నీటి విడుదల

26 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నందికొండ, సెప్టెంబర్ 10 : శ్రీశైలం నుంచి పెద్ద ఎత్తున వరద వస్తుండడంతో మంగళవారం నాగార్జున సాగర్ డ్యామ్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. శ్రీశైలం నుంచి 2,50,629 క్యూసెక్కుల వరద సాగర్‌కు వస్తుండగా అదే స్థాయిలో ఔట్‌ఫ్లో కొనసాగుతున్నది.

నల్లగొండలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, రజక సంఘాల రాష్ట్ర ముఖ్య సలహాదారుడు కొండూరు సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు

ధీర వనిత ఐలమ్మకు నివాళి

తెలంగాణ వీరనారి, ధీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ఆమె పోరాట పటిమను కొనియాడారు. భావి తరాలకు ఆమె జీవితం స్ఫూర్తిదాయకమని తెలిపారు.

నల్లగొండ వల్లభరావు చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్

9 ఫీట్ల కంటే తక్కువ ఉన్న విగ్రహాలే వల్లభరావు చెరువుకు..

- **ఆపైన ఉన్న పెద్ద విగ్రహాలు నాగార్జున సాగర్ బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లాలి**
- **కలెక్టర్ నారాయణరెడ్డి వెల్లడి**
- **తాగునీటి చెరువుల్లో నిమజ్జనం చేయొద్దు : ఎస్పీ శరత్‌చంద్రపవార్**
- **నల్లగొండలోని వల్లభరావు చెరువు పరిశీలన**
- **వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం**

రామగిరి, సెప్టెంబర్ 10 : వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని వల్లభరావు చెరువును ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16న గణేశ్ నిమజ్జనం నిర్వహిస్తుండగా అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వల్లభరావు చెరువుతోపాటు 14వ మైలురాయి నాగార్జున సాగర్ బ్రిడ్జి కింద, నిమజ్జనం జరిగే జిల్లాలోని అన్ని ప్రదేశాల్లో బారికేడింగ్, క్రేన్స్ ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ ఈఈని ఆదేశించారు. వల్లభరావు చెరువులో 9 ఫీట్లు కంటే తక్కువ ఉన్న విగ్రహాలను, అపై పెద్దగా ఉన్న వాటిని సాగర్ 14వ మైలురాయికి తరలించాలని తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 10గంటల వరకు నిమజ్జనం జరుగుతుందని, ట్రాఫిక్ మళ్లింపుతోపాటు బందోబస్తు , పారిశుధ్యం వంటి చర్యలు చేటపట్టాలని నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. వల్లభరావు చెరువులో నిమజ్జనానికి అవసరమైన నీటిని అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ద్వారాడి- 37, 39తోపాటు అన్ని డిస్ట్రిబ్యూటర్ల కింద ఆయకట్టు చివరి భూములకు సాగునీరు వెళ్లేవిధంగా చూడాలన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ తాగునీటి చెరువులలో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేయొద్దని, ఇతర ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక నిమజ్జనం రోజు పోలీసు బందోబస్తులో ఉన్న సిబ్బందికి రేడియం స్టిక్కర్స్‌ను ఏర్పాటు చేస్తే బాగుటుందని, సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేయాలని తెలిపారు. వారి వెంట అదనపు కలెక్టర్ పూర్ణచందర్, ఏఎస్పీ రాములునాయక్, ఆర్అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణరెడ్డి , ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, జిల్లా అగ్నిమాపక, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

రుణమాఫీపై రైతులకు స్పష్టమైన సమాధానం అందించాలి

కాంగ్రెస్‌కు రైతులు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయి • మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

రైతులకు న్యాయం చేయాలని ఏఈఓతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భగత్

త్రిపురారం, సెప్టెంబర్ 10 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఆగస్టు 15లోపు చేస్తాన్న రుణమాఫీ విషయమై స్పష్టమైన సమాధానం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మంగళవారం రైతులు పడుతున్న ఇబ్బందులు, రుణమాఫీ విషయమై అధికారులు, రైతులతో మాట్లాడారు. ఆధార్, బ్యాంక్ అకౌంట్‌లో చిన్న తప్పులు ఉన్నా రుణమాఫీకి అర్హులు కారని ఒకవైపు వ్యవసాయాధికారులు, మరోవైపు బ్యాంక్ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన అన్నారు. రైతులు పడుతున్న గోస సీఎంకు, మంత్రులకు పట్టడం లేదని తెలిపారు. వరదలు వచ్చి ప్రజలు ఇబ్బంది పడుతుంటే వాహనంపై చేయి ఊపుకుంటూ తిరిగితే ప్రజాపాలన కాదని, సెక్యూరిటీ లేకుండా సామాన్య నాయకుడిగా ఒక్క గ్రామంలో పర్యటించి రైతులు, ప్రజల కష్టాలను తెలుసుకోవాలని చెప్పారు. ఏ మంత్రిని అడిగినా రుణమాఫీపై పొంతన లేకుండా సమాధానం చెబుతున్నారని, రూ.2లక్షలు దాటిన రుణం వారి బ్యాంకుల్లో వేలకు వేలు డబ్బులు కట్టినా ప్రతిఫలం లేకుండా పోతుందని తెలిపారు. రైతులను మభ్యపెట్టి గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటిని అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని, పంట కాల్వలో పూడిక తీసే పరిస్థితుల్లో యంత్రాంగం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో చివరి భూములకు నీరు అందించామని, రైతుల కష్టాన్ని తమ కష్టంగా భావించిన కేసీఆర్‌నే అన్నదాతలు తలుచుకుంటున్నారని అన్నారు.

వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండడం లేదని, రైతుల పక్షాన అడగడానికి వస్తే ఐదు నిమిషాల ముందుగానే ఏఓ వెళ్లిపోయారని, ఏఈఓలు ఎలాంటి సమాధానాలు చెప్పకుండా తెలియదంటున్నారని చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, నిడమనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కామెర్ల జానయ్య, నాయకులు బైరం కృష్ణ, రాయనబోయిన వెంకటేశ్వర్లు, వెంకటాచారి, సయ్యద్, గుండెబోయిన వెంకన్న, చిమట మట్టయ్య, దైద రవి, బిచ్చునాయక్ ఉన్నారు.

యాదాద్రి పవర్ ప్లాంటుకు నేడు డిప్యూటీ సీఎం, మంత్రుల రాక

- **రెండో యూనిట్ ట్రయల్ రన్ చేయనున్న మంత్రులు**
- **రైల్వేలైన్లు పూర్తయిన తర్వాత పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి**

దామరచర్ల, సెప్టెంబర్ 10 : మండలంలోని యాదాద్రి పవర్‌ప్లాంటుకు డిప్యూటి సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం రానున్నారు. పవర్‌ప్లాంటులో నిర్మాణం పూర్తయిన రెండో యూనిట్‌ను వారు ఆయిల్‌తో ట్రయల్‌రన్ చేయనున్నారు. దీని ద్వారా 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. దీనితో పాటు మిగతా యూనిట్ల పనుల ప్రగతిపై టీజీ జెన్‌కో, బీహెచ్ఈఎల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. పవర్ ప్లాంటు త్వరితగతిన పూర్తయ్యేలా చేపట్టాల్సిన పనుల గురించి చర్చించనున్నారు. మంత్రుల రాకకోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్లాంటు అధికారులు తెలిపారు.

పూర్తికాని రైల్వే లైన్లు..

అనుకూలంగా లేని రహదారులు

మూడు నెలల్లో రెండోసారి మంత్రుల బృందం యాదాద్రి పవర్ ప్లాంట్‌ను పరిశీలన చేయనున్నది. పవర్ ప్లాంటు అనుసంధానం అయిన రైల్వే లైన్లు ఇంకా పూర్తికాలేదు. పవర్ ప్లాంటు పూర్తి స్థాయిలో బొగ్గుతో రన్ కావాలంటే సింగరేణి, మణుగూరు నుంచి దిగుమతి చేసుకునేందుకు విష్ణుపురం నుంచి జాన్‌పహాడ్ రైల్వే లైన్ నుంచి బైపాస్ లైన్లు ఇంకా పూర్తికావాల్సి ఉన్నది. గత రెండు నెలల నుంచి పవర్ ప్లాంటులోని రెండో యూనిట్ మొదటి స్టేజ్‌లో ఆయిల్ రన్ నిర్వహిస్తున్నారు. నేడు మంత్రులు ఆయిల్ రన్‌తో రెండోస్టేజీని సమీకృతం చేయనున్నారు. పవర్‌ప్లాంటుకు నార్కట్‌పల్లి అద్దంకి ప్రధాన రహదారి నుంచి అనుసంధానం చేసే రహదార్లు కూడా అనుకూలంగా లేవు. వాటిని ఆరు లైన్ల రహదారులుగా మార్చేందుకు ఎలాంటి పనులు చేపట్టలేదు. దీనితో పాటుగా పవర్‌ప్లాంటు ల్యాండ్ లూజర్లకు ఇంతవరకు ఉద్యోగ అవకాశాలు కల్పించక పోవడంతో యువత కూడా నిరుత్సాహంగా ఉన్నారు. పవర్‌ప్లాంటులో నాలుగేండ్లుగా వరుస దొంగతనాలు కూడా ఇబ్బందులు కల్గిస్తున్నాయి. ఇప్పటి పవరకు కోట్ల రూపాయల్లో ఇనుము, అల్యూమినియం, విలువైన సామాగ్రి చోరీకి గురైంది. పవర్‌ప్లాంటు కింద భూములు కోల్పోయిన నిర్వాసితులకు నేటికీ నష్టపరిహారం అందలేదని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు.